సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



## దుర్మార్గంగా వ్యవహరిస్తున్న జగన్

- అన్ని వర్గాల్లో జగన్‌పై వ్యతిరేకత
- 19న కమలాపురంలో చంద్రబాబు బహిరంగ సభ
- మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

కమలాపురం (కడప ఎన్టీఆర్‌సర్కిల్), జనవరి 13: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తూ వ్యవస్థలన్నింటినీ ఛిన్నాభిన్నం చేస్తూన్నారని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ నెల 19న కమలాపురంలో నిర్వహించే 'తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదలిరా' బహిరంగకు మాజీ సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. దీనికి సంబంధించి శనివారం కమలాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును దుర్మార్గంగా జైల్లో పెట్టి అనేక ఆంక్షలు విధించారన్నారు. ఆయన జైల్లో ఉండగానే ఎన్నికలు ముగించేయాలని చూశారని, అయితే అది సాధ్యపడలేదన్నారు. అనేక అటు పోట్లు ఎదుర్కొని చంద్రబాబునాయుడు జనం మధ్యకొచ్చారని అన్నారు. సీఎం జగన్‌రెడ్డిపై జనంలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తన ఇంట్లో, ఆఫీసులో సొంత కమ్యూనిటీలో కూడా వ్యతిరేకత ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది రెడ్ల పాలన చూశామని, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మైన్స్‌లో భారీ స్థాయిలో దోపిడీ జరుగుతోందని ఆయన వివరించారు. కమలాపురంలో ఈ నెల 19న కడప పార్లమెంటుకు సంబంధించిన 'తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా..' బహిరంగసభ జరుగుతుందన్నారు. సాయంత్రం 3గంటలకు సభ ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ భారీ స్థాయిలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, కడప పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు లింగారెడ్డి, మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్, నేతలు అమీర్‌బాబు, రితీశ్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి, ముక్తియార్, శివనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు ప్రత్యేక రైలు

కడప (ఎడ్యుకేషన్), జనవరి13: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 15, 16 తేదీల్లో సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్ (07489/07490) ప్రత్యేక రైలు కడప మీదుగా నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. సికింద్రాబాద్‌లో ఈ నెల 15వ తేదీ రాత్రి 8.10గంటలకు రైలు బయల్దేరి కాచిగూడ, జడ్చర్ల, గద్వాల్, కర్నూలు, గుత్తి, తాడిపత్రి మీదుగా మరుసటిరోజు తెల్లవారుజామున 5గంటలకు ఎర్రగుంట్ల చేరుకుంటుందన్నారు. 5.40గంటలకు కడప, 6.30 రాజంపేట చేరుకుని ఉదయం 9గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. అదే రైలు తిరుగు ప్రయాణంలో తిరుపతిలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 4.35గటలకు బయల్దేరి రాజంపేటకు సాయంత్రం 6, కడపకు 6.45, ఎర్రగుంట్ల 7.20కి, మరుసటి రోజు ఉదయం 6.25గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. సంక్రాంతిపండుగ రోజుల్లో రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారన్నారు.

# డిప్యూటీ సీఎం విందులో.. డిష్యుం డిష్యుం



- కొట్టుకోబోయిన కార్పొరేటర్లు, వైసీపీ నేతలు
- బలిజ, రెడ్డి సామాజిక వర్గాలుగా విడిపోయిన వైనం
- ఎమ్మెల్యే రవిరెడ్డి వర్గీయులుగా ముద్రపడ్డ పదిమంది కార్పొరేటర్లు డుమ్మా
- ఎందుకు డిన్నరో తెలియదు..
- పిలిచారు.. వెళ్లాం.. తిన్నాం.. వచ్చేశామన్న కొందరు కార్పొరేటర్లు

(కడప-ఆంధ్రజ్యోతి): మేడిపండు చూడ మేలిమై యుండు.. పొట్టవిప్పి చూడ పురుగులుండు... అన్నచందంగా కడప వైసీపీ పరిస్థితి తయారైంది. వచ్చే ఎన్నికల్లో కడప టికెట్ నాకే ఇచ్చారు.. నేనే మళ్లీ పోటీ చేస్తున్నానని ఇటీవలే డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కార్పొరేటర్లు, ఇతర ముఖ్యుల సమావేశంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఉమ్రా యాత్రకు సైతం వెళ్లి వచ్చారని సమాచారం. త్వరలోనే దేవుని కడప నుంచి ప్రచారం మొదలెడతామని ప్రతి డివిజన్‌లో 20 మంది తటస్థులను గుర్తించాలని కార్పొరేటర్లను ఆదేశించారు. ఆ సమయంలో ఓ కార్పొరేటరు అన్నా.. మీకు టికెట్ కన్‌ఫర్మ్ అయింది కదా.. మనోళ్లకు ఓ డిన్నర్ ఇవ్వన్నా అని అడిగితే ఒకే.. అన్నారు. కార్పొరేటర్లు, డివిజన్‌లో కీలక వ్యక్తులు, బూత్ కన్వీనర్లకు డిన్నర్ ఇవ్వాలని డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి నగర శివారులోని ఓ కల్యాణ మండపంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విందు ఇచ్చారు. డిప్యూటీ సీఎంతో పాటు, మేయరు సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు మెంబరు మాసీమబాబు, అఫ్జల్‌ఖాన్ ఇలా పలువురు విందుకు హాజరైనట్లు చెబుతారు. అయితే ఈ విందులో కార్పొరేటర్లు, వైసీపీ నేతల మధ్య మాటా మాటా పెరిగి కొట్టుకునే స్థాయికి వెళ్లడం కలకలం రేపింది. చివరికి ఈ రచ్చ ఎలా తయారైందంటే రెడ్డి, బలిజల మధ్య గొడవగా మారి తీవ్ర ఉద్రిక్తత ఏర్పడినట్లు చెబుతారు. ఊహించని ఈ పరిణామంతో బెంబేలెత్తిపోయిన పలువురు వైసీపీ కార్పొరేటర్లు, నేతలు.. ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడినుంచి పంపించేసి ఊపిరి పీల్చుకున్నారు.



### బలిజ వర్సెస్ రెడ్డి

టికెట్ కన్‌ఫర్మ్ కావడంతో కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విందు ఇచ్చారంటారు. కార్పొరేటర్లు తమ డివిజన్లలో రాబోయే ఎన్నికలకు సంబంధించి కీలకమైన వ్యక్తులను గుర్తించి దాదాపు 300 మందికి ఆహ్వానం అందించారంటారు. విందు మొదలైన కొద్దిసేపటికే డిప్యూటీ సీఎం, మేయరు, ఇతర ముఖ్య నేతలంతా వెళ్లిపోయారంటారు. అనంతరం అక్కడున్న వారిమధ్య కడపలో జరిగిన కొన్నిసంఘటనలు చర్చకు రావడంతో వివాదానికి కారణమయ్యాయని అంటున్నారు. "బలిజ కులానికి చెందిన రామచంద్రయ్యకు వైసీపీలో ఎలాంటి గుర్తింపు లేదు. ఆయనను ఎలాంటి కార్యక్రమాలకు పిలవలేదు. ఆయనను చాలా అవమానించారు. కడపలో కొందరిదే పెత్తనం" అని బలిజ సంఘం నేతలు వాపోగా.. వెంటనే మిగతా వారు "మీకు పదవులు ఇచ్చినా ఉండరు.. మీరు పార్టీ మారిపోతారు" అంటూ హేళన చేసే విధంగా మాట్లాడారని తెలిసింది. వైసీపీలో బలిజలకు గుర్తింపే లేదు, బలిజలను చిన్నచూపు చూస్తున్నారనే విషయంపై ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర స్థాయికి వెళ్లిందంటారు. మీరేంటి, మీరేంటి అనుకుంటుండగా చివరికి వైసీపీ నేతలు తోట క్రిష్ణ, మురళిక్రిష్ణ ఇతరులు బలిజ వర్గాలకు సపోర్టు చేయగా.. సుబ్బారెడ్డి మరికొందరు తమ సామాజిక వర్గాన్ని బలపరుస్తూ మాట్లాడడంతో ఈ సంభాషణ చిలికి చిలికి వానై గొడవకు దారి తీసి ఒకరినొకరు నెట్టుకున్నారని అంటున్నారు. చివరికి కొట్టుకునే స్థాయికి వెళ్లడంతో డిన్నర్‌లో గొడవ చూసి అవాక్కయిన కొందరు కార్పొరేటర్లు, నేతలు ఇరువర్గాల వారికి సర్దిచెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు.

### పది మంది కార్పొరేటర్లు డుమ్మా

కడప కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా 48 స్థానాల్లో వైసీపీవారే కార్పొరేటర్లుగా ఉన్నారు. ఒకరు ఇండిపెండెంట్ కాగా మరొకరు టీడీపీ. స్వతంత్ర అభ్యర్థి కూడా వైసీపీ వెన్నంటే ఉన్నారంటారు. డిప్యూటీ సీఎంకు తిరిగి టికెట్ కన్‌ఫర్మ్ అయిందని కార్పొరేటర్లకు, డివిజన్‌లోని బూత్ కన్వీనర్లకు ఇచ్చిన విందుకు 10 మంది కార్పొరేటర్లు హాజరు కాకపోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. అందులోనూ ఆ పది మంది కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ముఖ్య అనుచరులు కావడం గమనార్హం. అందులో రవిరెడ్డి ముఖ్య అనుచరుడైన పాకా సురేశ్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డితో పాటు మరో ఐదుగురు ఇంకో ముగ్గురు మైనార్టీ కార్పొరేటర్లు డుమ్మా కొట్టారు. ఇందులో కొందరు కార్పొరేటర్లు తమకు ముందస్తు సమాచారం లేదని తెలుపగా.. మరికొందరు ఆ సమయానికి వేరే ప్రాంతాల్లో ఉన్నాం, అందువలన విందుకు పోలేదని చెప్పారు. అయితే అందుబాటులో ఉన్న కార్పొరేటర్లు కూడా విందుకు వెళ్లకపోవడం గమనార్హం. హాజరైన కొందరు ఏదో పిలిచారు.. ఎందుకు డిన్నర్ ఇచ్చారో తెలియదు. రమ్మన్నారు.. వెళ్లాం.. తిని వచ్చేశాం అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.



# మార్కెట్‌లో సంక్రాంతి సందడి

కడప (కల్చరల్), జనవరి 13: సంక్రాంతి అంటేనే సంబరాల పండుగ. పల్లెలు... పట్టణాలనే తేడా లేకుండా తెలుగు లోగిళ్లలో అంబరాన్ని అంటేలా పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఇతర ప్రాంతాలలో వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువులు తదితర వ్యాపకాలతో ఉండే జిల్లా వాసులంతా స్వంత ఊళ్లకు చేరుకుంటారు. కుటుంబాలతో ఇంటిల్లిపాది ఆనందకరంగా పండుగను జరుపుకునేందుకు ఉత్సాహంగా పల్లెలకు పయనమవుతారు. ఆదివారం నుంచి పండుగ ప్రారంభం కానుంది. శనివారం రెండో శనివారం శెలవు వచ్చింది. దీంతో కడప గడపకూ సంక్రాంతి సందడి వచ్చేసింది. ఇంట్లోకి అవసరమైన సరుకులు కొనుగోలు చేసేందుకు జనం పెద్ద ఎత్తున మార్కెట్‌కు చేరుకోవడంతో కడపలోని వైవీ స్ట్రీట్, టీకేఎం స్ట్రీట్, మద్రాస్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండు సమీప వివిధ దుస్తుల మాల్స్ రద్దీగా మారాయి. సంక్రాంతిని పురస్కరించుకుని ఇప్పటికే విడుదలైన వివిధ హీరోల కొత్త సినిమాల సందడి చేస్తున్నాయి. పూల దుకాణాల వద్ద అలాగే పండ్లు, స్వీట్లు దుకాణాల వద్ద తాకిడి పెరిగింది. నిత్యం వివిధ పనులతో బిజీగా గడిపే ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు పండుగ పూట అయినవారితో హాయిగా గడిపేందుకు గ్రామాలకు తరలివెళ్లడంతో పల్లెల్లోనూ సందడి జోరందుకుంది. సంక్రాంతి మూడురోజుల పండుగ. ఇది ముఖ్యంగా రైతుల పండుగ. మొదటి రోజు భోగి, రెండోరోజు పెద్దపండగ, మూడోరోజు కనుమ జరుపుకుంటారు. భోగం అంటే ఆనందం.. సంతోషం. పొలాల్లో రైతులు సాగుచేసిన పంటలు ఇంటికి చేరడంతో ఆ ఇంట ఆనందం వెల్లివిరుస్తుంది. ఉదయాన్నే పిల్లల తలలపై రేగుపళ్లు ఉంచి భోగి నీళ్లు పోస్తారు. రేగడం అంటే కొత్త ఆశలు చెలరేగడం. భోగి మంటలు వేసి తద్వారా పాత ఆలోచనలను, చెడు భావాలను దహించి నూతన భావాలకు స్వాగతం పలుకుతారు.





# సజ్జల బెదిరింపులపై అంగన్వాడీల ఆగ్రహం

- ఫొటోతో ఊరేగింపు జరిపి చెప్పులతో సత్కారం



ప్రొద్దుటూరులో సజ్జల ఫొటోను చెప్పులతో కొడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రొద్దుటూరు, జనవరి 13: సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే కొత్తవారిని తీసుకుంటామని బెదిరించేలా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటన చేయడంపై అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్దనుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు సజ్జల చిత్రపటంతో అంగన్వాడీలు నిరసన ర్యాలీ చేపట్టారు. పుట్టపర్తి సర్కిల్లో సజ్జల ఫొటోకు చెప్పులతో సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎంతో సహనంగా 33 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చర్యలకని పిలిచి బెదిరింపులకు పాల్పడ్డంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతన విషయంలో, రిటైర్మెంట్ బెనిఫిట్ విషయంలో ఏ హామీ ఇవ్వకుండా సమ్మెను విరమించమనడం అవమానించడమే అన్నారు. ఇదే బెదిరింపులతో వ్యవహరిస్తే ఈ ప్రభుత్వానికి గోరీ కడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేశ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్, అంగన్వాడీ నేతలు సుబ్బలక్ష్మి, విజయ, పద్మ, సువార్తమ్మ, గురుదేవి, రాజీ, శివమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా వ్యాప్తంగా కొనసాగిన నిరసనలు

అంగన్వాడీల సమ్మె శనివారంతో 33వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. కడప కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. జమ్మలమడుగులో ఎస్మా ప్రతులను తలపై పెట్టుకుని నిరసన తెలిపారు. అంగన్వాడీలతో మంత్రులు, సజ్జల రామక్రిష్ణారెడ్డి జరిపిన చర్చలు బూటకమంటూ కొండాపురంలో వారి ఫొటోలతో నిరసన తెలిపారు. చాపాడులో నిరసన కొనసాగించారు. చర్చలకు పిలిచి న్యాయం చేయకపోవడంతో పోరుమామిళ్లలో జగన్, బొత్స మాస్కులు ధరించిన వారిని వేపమండలతో కొడుతూ నిరసన తెలిపారు. మైదుకూరులో పొర్లుదండాలతో, ఎర్రగుంట్లలో సాష్టాంగ నమస్కారాలతో ఆందోళన చేశారు.



పోరుమామిళ్లలో సీఎం జగన్, బొత్స, సజ్జల మాస్కులు ధరించినవారికి వేప మండలతో కొడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



జమ్మలమడుగులో నెత్తిన ఎస్మా ప్రతులతో ఆందోళన



మైదుకూరులో పొర్లుదండాలతో అంగన్వాడీల నిరసన

## సజ్జల వ్యాఖ్యలు హాస్యాస్పదం : తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 13: అంగన్వాడీలకు జూలై మాసంలో గౌరవ వేతనం ఎంతోకొంత పెంచుతామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని, జూలై వరకు వైసీపీ ప్రభుత్వం ఉంటే కదా అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టించడం, ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకతప్పదు.. తెగేదాకా లాగొద్దు అని సజ్జల బెదిరించడం గర్హనీయమన్నారు.

అంగన్వాడీ వ్యవస్థ మహోన్నతమైనదని, ఇది కాంగ్రెస్ పార్టీ మానసపథకం అన్నారు. బాలబాలికలలో, గర్భిణీ స్త్రీలలో, బాలింతల్లో పౌష్టికాహార లోపం నివారణ కోసం 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దీనిని పారంభించారన్నారు. భేషజాలకు పోకుండా అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తులసిరెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

## టీడీపీ వస్తే మీ ఆస్తులు సేఫ్

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



టీడీపీలో పలువురు చేరిక సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): "వైసీపీ పాలనలో కడపలో ఎందరో ఆస్తులు పోగొట్టుకున్నారు. వైసీపీ మూకలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను అడ్డంగా లాక్కున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాటన్నింటిని తిరిగి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగిస్తాం. టీడీపీ వస్తేనే అందరి ఆస్తులు సేఫ్‌గా ఉంటాయి" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని 4వ డివిజన్‌లో పలువురు కత్తి రవీంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడపలో సామాన్యజనం బతికే పరిస్థితులు లేవన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు అనుచరులు మధ్యతరగతి, పేదల ఆస్తులు లాక్కుంటున్నారని, తెల్లారేసరికి మా ఆస్తులు ఉంటాయో ఉండవోనన్న భయం నగరవాసుల్లో ఉందన్నారు.

జగన్ పాలనంతా కబ్జాలమయంగా మారిందన్నారు. ప్రభుత్వ భూములను, ప్రైవేటు ఆస్తులను కబ్జా చేసిన వారిపై టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాదారులు, రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాధవీరెడ్డి, జనసేన జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, యాటగిరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### అలరించిన మాయాబజారు

సంక్రాంతి సందర్భంగా పులివెందులలో సురభి నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సురభి కళాకారులు ప్రదర్శించిన మాయాబజారు నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

## నేటి నుంచి శిల్పారామంలో
# సంక్రాంతి సంబరాలు

పులివెందుల రూరల్, జనవరి 13: పట్టణంలోని శిల్పారామంలో 14వ తేదీ ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలు పేరుతో పలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ భోగి పర్వదినం పురస్కరించుని భోగిమంటలు ఏర్పాటు, మహిళలకు ముగ్గుల పోటీలు, శ్రీరాజా కళానియం బృందంచే నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి మిక్సీ, రెండవ బహుమతి రైస్‌కుక్కర్, మూడవ బహుమతి ప్రెషర్ కుక్కర్ బహుమతిగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ఉంటటాయన్నారు. 15వ తేదీ సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాల పండుగ, యువరాజ డ్యాన్సింగ్ స్కూల్ బృందంచే నృత్య ప్రదర్శనలు, 16వ తేదీ కనుమ సదర్భంగా ఎస్‌కే ఫిల్మ్ డ్యాన్స్ స్టూడియో, మనూస్ డ్యాన్స్ అకాడమీ వారిచే నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. తెలుగు వారికి ప్రధానమైన సంక్రాంతి పండుగను తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన శిల్పారామంలో ఏర్పాటు చేస్తున్నందున ప్రజలందరు పాల్గొని జయప్రదం చేయాలని ఏఓ సుధాకర్ కోరారు.

## ఆర్టీసీ అద్దె బస్సు హెల్పర్‌పై దాడి

- ఏడుగురిపై కేసు నమోదు
- దాడికి పాల్పడిన వారిలో ఏఎస్ఐ, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్

కడప (క్రైం), జనవరి 13: కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ అద్దె బస్సును పార్కింగ్ చేస్తున్న హెల్పర్ ప్రసాద్‌పై ఏడుగురు దాడి చేసినట్లు వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు... గత నెల 30న ఆర్టీసీ అద్దె బస్సు హెల్పర్ ప్రసాద్ బస్సును పార్కింగ్ చేస్తుండగా నిందితులు రవికుమార్, కిశోర్‌కుమార్, మరో ఐదుగురు కలిసి దాడి చేశారు. ఈ ఘటనపై హెల్పర్ ప్రసాద్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వివరించారు. వీరిలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్, ఏఎస్ఐ భాస్కర్ ఉన్నారు.

## ఇరువురి అరెస్టు.. మద్యం స్వాధీనం

కడప (క్రైం), జనవరి 13 : కడప నగరం రైతు బజారు వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కడపకు చెందిన వసంత్, చిన్న మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 20 క్వార్టర్ బాటళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం

- బీసీవైపీ నేత డేవిడ్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 13:రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం కొనసాగుతుందని బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ కర్త డేవిడ్ ఆరోపించారు. శనివారం కడప నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా, రాజ్యాంగబద్ధ దేశంలో జీవిస్తున్నామా అనే అనుమానం నెలకొనిందన్నారు. ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో పోలీసులను అడ్డుపెట్టుకుని పెద్దిరెడ్డి చేస్తున్న నీచ రాజకీయాలు తారాస్థాయికి చేరిందని చెప్పారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతున్నట్లు తెలిపారు.పుంగనూరులో పతాకస్థాయికి చేరిన మంత్రి రామచంద్రారెడ్డి, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, సీఐలు రాఘవరెడ్డి , క్రిష్టారెడ్డిల ఆగడాలు మితిమీరాయన్నారు.

## రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే లక్ష్యం

కడప (మారుతీనగర్), జనవరి 13: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా తమ పార్టీ ప్రజల్లోకి వస్తుందని జై భారత్ పార్టీ రాయలసీమ అధ్యక్షుడు బుడ్డారెడ్డి గారి వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర వ్యాపితంగా అన్ని పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు తమ పార్టీ పోటీచేస్తోందన్నారు. సమావేశంలో పార్టీ ప్రతినిధి బెల్లంకొండ కుమారస్వామి పాల్గొన్నారు.

# టీడీపీ గెలుపుతోనే అన్ని వర్గాల అభివృద్ధి

- కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): టీడీపీ గెలుపుతోనే అన్ని వర్గాల అభివృద్ధి సా..ధ్యమని టీడీపీ పార్లమెంటు సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, నియో జక వర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి హామీ ఇచ్చారు. శనివారం పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి మాట్లాడుతూ కడపలో జనం భయం భయంగడా మధ్య బతుకుతున్నారు. పేదల ఆస్తులను డిప్యూటీ సీఎం అండ్‌కో లాక్కుంది. ప్రశ్నిస్తే గొంతును నొక్కేస్తున్నారు. కడప అంటేనే ఉద్యోగులు, పిల్లల చదువుల కోసం, వ్యాపారం ఇతరత్రా వచ్చిన వారి కూడలి. అందుకే ఇక్కడందరూ స్థిరపడ్డారు. ఇది రౌడీడింగ్ కాకూడదు. టీడీపీ వచ్చిన తరువాత రౌడీమూకలను కూకటివేళ్లతో పెకలించి వేస్తాం. ప్రభుత్వ, పేదల భూములు ఆక్రమించిన వారిపై వారి ఆస్తులు తిరిగి స్వాధీనం చేసుకుని వారికే అప్పజెబుతామన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చాలా మంది జనాలకు తెలియదు. ఆయన తెలిసిందంతా దోచుకోవడమే అంటూ విమర్శించారు.



టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారితో మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు

జనసేన జిల్లా కోఆర్డినేటరు సుంకరశ్రీనివా స్, టీడీపీ నగర అధ్యక్షులు శివకొండారెడ్డి, బెస్త సాధికార రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్, కత్తి రవీంద్ర పాల్గొన్నారు. ఇక సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలను శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి ప్రారంభించారు.

# వేతనాలు పెంచమంటే బెదిరిస్తారా?

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ఆగ్రహం
- 33వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

కడప (నాగరాజుపేట), జనవరి 13 : అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని చర్చలకు పిలిచి సజ్జల రామక్రిష్ణారెడ్డి బెదిరింపులకు దిగడం ఏమిటని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం ఐదు సార్లు ఇప్పటికి చర్చలు పిలిచి వేతనాలు పెంచం, మీరు డ్యూటీలో జాయిన్ కావాలని లేకుంటే ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వస్తుందని సజ్జల రామక్రిష్ణారెడ్డి బెదిరింపులు చేయడం సరికాదన్నారు. జగన్‌రెడ్డి ప్రతిపక్షంలో చెప్పిన హామీలే అమలు చేయమన్నామని, అంగన్వాడీలు గొంతెమ్మ కోరికలేవీ కోరడంలేదని ఈ విషయం సజ్జల గుర్తు పెట్టుకోవాలన్నారు. తక్షణం అంగన్వాడీల వేతనాల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సమయంలో కూడా అంగన్వాడీలు మొక్కవోని దీక్షతో రోడ్లపైనే రేయింబవళ్లు శాంతియుతంగా పోరాడుతున్నారని సజ్జల బెదిరింపులకు బెదిరేది లే దని, వేతనాల పెంపు జీవో ఇచ్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

అంగన్వాడీ పోరాటానికి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసులు సంఘీభావం తెలిపారు. సీఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి.వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా, నగర ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, అంజనీదేవి పాల్గొన్నారు.

# సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

కడప (కల్చరల్), జనవరి 13: సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో భాగంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలో శనివారం ఉదయం మహిళలకు ముగ్గుల పోటీలలో జి. కల్పన విజేతగా నిలిచారు. శిల్పారామం పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో చేపట్టిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా పోటీలకు న్యాయ నిర్ణేతలుగా హేమలత, ఎస్. తనూజ వ్యవహరించారు. ద్వితీయ విజేతగా పి. సుమలత, తృతీయ విజేతగా ఎస్. అరుణ కుమారి నిలిచారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

### విజయదుర్గ కాలనీ ముగ్గుల పోటీలకు విశేష స్పందన

కడప (కల్చరల్), జనవరి 13: సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకుని నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గమ్మ కాలనీలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు సీఆర్ఐ సునీల్ జయంత్, సీఆర్ఐ దినేష్‌కుమార్, గోవిందునాగరాజు ఆధ్వర్యంలో సీఆర్ఐ సునీల్ జయంత్ నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా మహిళలు హాజరై పోటీలలో చూడచక్కని రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. ఇందులో ప్రథమ విజేతగా ఎ.లత, ద్వితీయ విజేతగా కల్పనారెడ్డి, తృతీయ విజేతగా టి.రమ్యలకు బహుమతులు నిర్వాహకులు అందజేయనున్నారు. న్యాయనిర్ణేతలుగా వైవీయూ పాలకమండలి సభ్యురాలు జానపాటి వెంకటలక్ష్మి, 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుజాత హాజరయ్యారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సొలేషన్ బహుమతులను అందజేశారు.




విజేతలకు నగదు బహుమతులను అందజేస్తున్న దృశ్యం



# సురభి నాటకాలది ఒక గొప్ప చరిత్ర

- మన ప్రాంతం నుంచి దేశ నలుమూలలకు సురభి నాటకాలు
- సురభి నాటకాల ప్రారంభోత్సవంలో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల, జనవరి 13: సురభి నాటకాలకు ఒక గొప్ప చరిత్ర ఉం దని ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పే ర్కొన్నారు. శనివారం సురభి నాటకాల ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితో కలిసి గణనాథునికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ మాట్లాడుతూ పులివెందులలో సురభి నాటకాల ప్రదర్శన మరచిపోలేదనిదన్నారు. సురభి నా టకాలకు ఎంతో చరిత్ర ఉందని, ఈ నాటకా లు చూసేందుకు మనకు అవకాశం రావడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నాటకాలను వారివారి కుటుంబ సభ్యులతో కలిసిచూస్తే సురభినాటకాల ప్రదర్శన గొప్పదనం ఏమిటో తెలుస్తుందన్నారు. ఈ నాటకాలు పులివెందుల ప్రాంతంలో పు రుడు పోసుకున్నాయన్నారు. ఈ ప్రాంతం నుంచి దేశ నలుమూలలకు చేరాయన్నారు. ఎంతటి ప్రాముఖ్యత ఉందో మీ అందరికి ఇట్టే అర్థం అవుతుందన్నారు. అనంతరం వినాయక నాట్యమండలి నిర్వాహకులు వేణుగోపాలరావు మాట్లాడుతూ మా నాటకాలను సొంత గడ్డపై ప్రదర్శించేందుకు అవకాశం రావడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. సంక్రాంతి పండగకు వారివారి సొంత గ్రామాల కు వచ్చినట్లు మా నాటక ప్రదర్శనలు కూడా సొంత ప్రాంతానికి వచ్చి ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలోని అందరుమన నాటకాలను చూసి ఆనందించాలని కోరుతున్నామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తదితరులు తదితరులు పాల్గొన్నారు.



సురభి నాటకాల ప్రదర్శనలను ప్రారంభిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి



సురభి నాటకంలోని ఓ దృశ్యం



## యోగా దంపతులకు సన్మానం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 13 : కడప వైవీయూలో సంక్రాంతిని పురస్కరించుకుని యోగా దంపతులను యోగా సభ్యులు ఘనంగా సత్కరించారు. గత 25 సంవత్సరాల నుంచి పాలెంపల్లె అ య్యవారురెడ్డి ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఉదయం 5 నుంచి 6.30 వరకు ఉచితంగా యోగా క్లాసులు నిర్వహిస్తున్నారని, వారి సేవా దృక్పథానికి గుర్తుగా సన్మానించుకోవడం సంతోషంగా ఉందని యోగా సభ్యులు తెలిపారు. యోగా సభ్యులు యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, తమ అనుభవాలను పంచుకున్నారు.



సన్మానం అనంతరం యోగా దంపతులు

## క్రీడల ద్వారా పేరు ప్రఖ్యాతులు

వేంపల్లె, జనవరి 13: క్రీడల ద్వారా పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని ఎంపీడీఓ దివిజ, సర్పంచు ఆర్.శ్రీనివాసులు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ విజేతగా వేంపల్లె గాజులపేట క్రికెట్ జట్టు నిలిచింది. రన్నర్‌గా కత్తలూరు జట్టు నిలిచింది. వీరికి బహుమతులను పంపిణీ చేశారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించాలి

చక్రాయపేట, జనవరి 13: పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించాలని అక్కడి విద్యార్థులు కోరుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... చక్రాయపేట మండలం అతిమారుమూల ప్రాంతం, వెనుకబడిన ప్రాంతం కూడా. ఈ మండలంలోని విద్యార్థులు సుదీర్ఘ ప్రాంతాల నుంచి పాఠశాలలకు వస్తుంటారు. గతంలో చక్రాయపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు నిర్వహించేవారు. అయితే గత నాలుగు సంవత్సరాల క్రితం చక్రాయపేటలో వసతులు లేవని ఆ పరీక్షా కేంద్రాన్ని దూరప్రాంతంలోని గండి గురుకుల పాఠశాలకు తరలించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 60 సంవత్సరాలుగా పబ్లిక్ పరీక్షలు నిర్వహించేవారు. అలాంటిది సౌకర్యాలు లేవని మార్చారు. అయితే ఇటీవల చక్కటి భవనాలను నిర్మించారు. మంచి సౌకర్యాలు కూడా ఉన్నాయి. పరీక్ష కేంద్రం ఇవ్వలేదు. మండలంలోని మహదేవపల్లె జడ్పీ హైస్కూల్, నాగులగుట్టపల్లె జడ్పీ హైస్కూల్, చిలేకాంపల్లె జడ్పీ హైస్కూల్, కస్తూర్బా పాఠశాల, గండి గురుకుల పాఠశాల విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాసేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలలు అన్నీ సుదీర్ఘప్రాంతమైన గండి గురుకుల పాఠశాలకు వెళ్లి పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఎర్రగుడి నుంచి పరీక్ష కేంద్రం 25 కిలోమీటర్లు. పైగా బస్సు సౌకర్యం కూడా లేదు. మహదేవపల్లె నుంచి 20 కిలోమీటర్లు, చిలేకాంపల్లె నుంచి 18కిలోమీటర్లు, చక్రాయపేట నుంచి 6కిలోమీటర్లు ఉంటుంది. కావున చక్రాయపేటలో 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తే అన్ని ప్రాంతాలకు దగ్గరగా ఉంటుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గతంలో ఉన్నతాధికారులకు తెలిపారు. అక్కడ ప్రస్తుతం పూర్తిస్థాయిలో భవనాలు ఉన్నాయని, చక్రాయపేటలోనే పరీక్ష కేంద్రం ఏర్పాటుచేయాలని వారంతా కోరుతున్నారు.



చక్రాయపేటలో నూతనంగా నిర్మించిన జడ్పీ ఉన్నత పాఠశాల

**ఆ పాఠశాలలో మా తాతగారి కాలం నుంచి పరీక్షలు రాసేవారు**

మా తాతగారి కాలం నుంచి చక్రాయపేటలోని పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాసేవారు. ప్రస్తుతం గండి గురుకుల పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఉదయం 6గంటల నుంచి బయలుదేరితే అక్కడికి చేరుకోగలం. దూరప్రాంతాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాన్ని అందరికీ అనువుగా ఉండే చక్రాయపేటలో ఏర్పాటు చేయాలి.



- జగన్, 10వ తరగతి విద్యార్థి, బీసీ హాస్టల్, చక్రాయపేట

## కోడి పందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు: ఎస్ఐ

సింహాద్రిపురం, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్కే రోషన్ పేర్కొన్నారు. జూదక్రీడల జోలికి వెళ్లకుండా సంప్రదాయ ఆట, పాటలతో సంక్రాంతి పండుగను మండల ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఎస్ఐ మండల ప్రజలకు తెలిపారు. సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, జూదం నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 9121100613 నెంబరుకు తెలిపితే నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంక్రాంతి సెలవులకు చదువుకునే పిల్లలు ఇంటికి వచ్చి ఉంటారని, వారితో కలిసి కుటుంబ సభ్యులు సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఎస్ఐ కోరారు.

## నేడు శ్రీరంగనాథ, గోదాదేవి కల్యాణం

పులివెందుల రూరల్, జనవరి 13: శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరంగనాథ, గోదాదేవిల క ల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రధాన అర్చకు డు సోమేపల్లె కృష్ణరాజేష్ శర్మ నేతృత్వంలో ఈ కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పవిత్ర ధనుర్మాసం నాడు వచ్చే భోగి పండుగను ప్రతి ఏడాది కల్యాణం ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తిలకించాలని కోరారు.



శ్రీరంగనాథస్వామి ఆలయంలో గోదాదేవి మూల విరాట్

## బి.చెర్లోపల్లిలో అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు

సింహాద్రిపురం, జనవరి 13: మండలంలోని బి.చెర్లోపల్లిలో అయోధ్య రామయ్య అక్షింతలను శనివారం గ్రామస్థులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. చెర్లోపల్లికి చేరిన రామయ్య అక్షింతలను గ్రామ శివార్లనుంచి శ్రీరాముల వారి చిత్ర పటాలను ప్రత్యేకంగా ట్రాక్టరులో ఏర్పాటు చేసుకుని చిన్నారుల కోలాటములతో, కాషాయ జెండాలు చేత పట్టి జై శ్రీరామ్ అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగేలా భక్తిశ్రద్ధలతో నినాదాలు చేస్తూ తీసుకొచ్చారు. గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేసి, అక్షింతలను ఎలా ఉపయోగించుకోవాలని ప్రజలకు తెలియజేశారు. అయోధ్యలో రామయ్య విగ్రహ ప్రతిష్ఠ వివరాలు గ్రామస్థులకు తెలియజేశారు.



బి.చెర్లోపల్లిలో అయోధ్య రామయ్య అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్థులు

## ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి: డీవైఎఫ్ఐ

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 13 : జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలపై రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాలశివకుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ వద్ద సమావేశంలో నగర కార్యదర్శి ఓబులేసుతో కలిసి మాట్లాడారు. జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రజల వద్ద అధిక ఛార్జీల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రధానంగా విజయవాడ, హైదరాబాదు, బెంగుళూరు వంటి ఇతర ప్రాంతాల నుండి పండుగకు ఇంటికి వచ్చే సరికి ట్రావెల్స్ ఛార్జీలు మోతతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. సామాన్య ప్రజలు ప్రయాణాలు చేయాలంటే అధిక ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఛార్జీలు అధికంగా వసూలు చేసే ట్రావెల్స్ యాజమాన్యాలపై రవాణా శాఖ అధికారులు దాడులు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని లేదంటే డీవైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని అన్నారు.

## దర్గా ఉరుసు ఉత్సవాలను దిగ్విజయం చేయండి

కడప (కల్చరల్), జనవరి 13: కడప నగర రవీంద్రనగర్‌లో వెలసిన చారిత్రాత్మక మజరత్ సయ్యద్ షా గౌస్ శర్మద్ ఖాద్రి ఉరుసు ఉత్సవాలు ఈనెల 25, 26 తేదీలలో జరుగనున్నాయని, విజయవంతం చేయాలని ఆ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా ఇలియాస్ బాషా ఖాద్రి పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలలో మొదటి రోజైన 25వ తేదీ గురువారం గంధోత్సవంతో ప్రారంభమవుతాయన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక రవీంద్రనగర్‌లోని ఆ దర్గాలో ధ్వజారోహనం (నిషాన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ 26వ తేదీ శుక్రవారం రాత్రి అన్నదాన కార్యక్రమం (తహలీల్) తదుపరి శనవారం ఫాతేహా కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కావున కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలవారు పాల్గొని ఉత్సవాలను దిగ్విజయం చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం సంఘ సేవకుడు సలావుద్దీన్ మాట్లాడుతూ రవీంద్రనగర్‌లోని హజ్రా మసీదు, దర్గా ఒకే కాలానికి చెందినవని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం వలన మనసుకు ప్రశాంతత, శరీరానికి ఆరోగ్యం లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆరిఫుల్లా, దర్గా ప్రతినిధులు కరీముల్లా, అలీంబాష, బాబు భాయ్, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి

## డెమో రైలు పొడిగింపు హర్షణీయం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 13 : నంద్యాల- కడప డెమో రైలు రేణిగుంట వరకు పొడిగించడం పట్ల కడప రైల్వేస్టేషన్ కన్సాలిటేటివ్ సభ్యుడు లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌నాయుడు, క్రిష్టారెడ్డి, నాగిరెడ్డి, బీజేపీ నాయకలు బాలక్రిష్ణయాదవ్, కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ రైలు శనివారం కడపకు చేరుకోగానే వారు లోకో పైలట్‌కు గార్డుకు మిఠాయిలు పంచి తమ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నంద్యాల, కడప డెమో రైలు రేణిగుంట వరకు పొడిగించడం వల్ల ఉమ్మడి కడప జిల్లా వాసులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న ప్రతినిధులు

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


అల్ఫా మృతదేహం

రాయచోటిటౌన్, జనవరి13: స్థానిక రవిహోల్ సమీప బలరామరాజువీధి వాసి షేక్. జిలానీ భార్య అల్ఫా (21) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసు ల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... జిలానీ కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి అల్ఫా రెండో భార్య, జిలానీ మొదటి భార్యకు కుమారుడితో కలిసి కొత్తపల్లిలో ఉంటున్నారు. ఈ క్రమంలో అల్ఫా తల్లి ఇటీవల కువైట్ నుంచి ఇండియాకు వచ్చి కుమార్తెను చూసేందుకు శుక్రవారం రాత్రి రాయచోటికి వచ్చింది. కుమార్తె, అల్లుడు జిల్లానితో కలిసి భోజనం చేసిన అనంతరం వ్యాపారం రిత్యా మదనపల్లెకు వెళుతున్నానని శుక్రవారం రాత్రి జిలానీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఇంట్లో అల్ఫా, ఆమె తల్లి కలిసి బెడ్ రూమ్‌లో పడుకున్నారు. అయితే తెల్లవారి చూసేసరికి అల్ఫా ఇంట్లోనే హాల్లో అచేతనంగా పడి ఉండడం చూసి ఆమె తల్లి కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని జరిగిన సంఘటనపై సమాచారాన్ని పోలీసులకు అందించారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘనటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతు రాలి భర్త, మరికొరి కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## కారు, స్కూటర్ ఢీ - మహిళ మృతి


గంగాదేవి మృతదేహం

ఖాజీపేట, జనవరి 13: కడప-కర్నూలు జాతీయ రహదారిపై రహమత్‌ఖాన్‌పల్లె వద్ద కారు, స్కూటర్ ఢీకొనడంతో సి.గంగాదేవి (40) మృతిచెందింది. వివరాల్లోకి శితే... దువ్వూరు మండలం గుడిపాడు వాసి సి.బాలవర్ధరాజు, గంగాదేవి శనివారం సాయంత్రం సంక్రాంతి పండుగకు సిద్దవటం మండలం వెంకటాయపల్లెలో ఉన్న కూతురు వద్దకు వెళుతుండగా రహమత్‌ఖాన్‌పల్లె వద్ద కారు స్కూటర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగాదేవి మృతిచెందినట్లు వారి బంధువులు తెలిపారు.

## ఆటో బోల్తా పడి వృద్ధుడు....


పుల్లయ్య మృతదేహం

పులివెందుల టౌన్, జనవరి 13: స్థానిక మెడికల్ కళాశాల సమీపంలో శనివారం రాత్రి ఆటో బోల్తా పడడంతో గురకల పుల్లయ్య (62) మృతిచెందగా అన్వర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... వేముల మండలం పెండ్లూరు వాసి పుల్లయ్య రైట్స్ డైరెక్టర్ త్యాగరాజు తోట వద్ద కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. తోటలో క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న జమ్మలమడుగు వాసి అన్వర్ ఆటోలో ఎక్కారు. మెడికల్ కళాశాల సమీపంలో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పుల్లయ్య మృతి చెందగా అన్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, అన్వర్‌ను చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## పెద్దిరెడ్డి దుర్మార్గాలకు బీసీలు బుద్ధిచెబుతారు

### బీసీవైపీ కార్యకర్తలపై దాడిచేసిన పోలీసులపై హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు


విలేకరులతో మాట్లాడుతున్న కరుణాకర్

ప్రొద్దుటూరు, జనవరి 13: జగన్ ప్రభుత్వంలో బీసీలు మీటింగులు పెట్టుకున్నా సహించలేని స్థితిలో వున్నారని బీసీలకు రాజ్యాధికారంలో భాగం కల్పిస్తున్నామని చేస్తున్న సామాజిక యాత్ర ఎంతబూటకమో పుంగనూరు ఘటన రుజువు చేస్తోందని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరుణాకర్ విమర్శించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరులో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో సభ నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించడం చూస్తే బీసీలపట్ల జగన్ వైఖరి తేటతెల్లమౌతోందన్నారు. పుంగనూరులో బీసీ సభను పోలీసుల చేత అడ్డుకోవడమే కాకుండా వారిపై చెప్పులతో దాడులు చేయడం హేయమైన చర్య అని, జగన్ దీనికి సమాధానం చెప్పాలన్నారు. పుంగనూరులో ప్రజాస్వామ్యం లేదని పెద్దిరెడ్డి రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేల రాజ్యాంగం, రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందన్నారు. పుంగనూరు ఘటనపై హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ తరపున జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

## హత్య కేసులో సిబ్బందికి ఎస్పీ అభినందనలు


ప్రశంసాపత్రాలతో సిబ్బంది

కడప (క్రైం), జనవరి 13: డిగ్రీ విద్యార్థిని హత్య కేసులో ముగ్గురు నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అభినందించారు. బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో 2021లో డిగ్రీ విద్యార్థిని హత్య జరిగింది. ఈకేసును ఫాస్ట్ ట్రాక్ కేసుగా పరిగణించి తగిన సాక్ష్యాధారాలతో నేర నిరూపణకు కృషి చేసిన బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ ఆర్‌వీ నరసింహారావు, కోర్టు కానిస్టేబుల్ ఎ.సురేష్ బాబు (హెచ్‌సీ 892), కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ జాకబ్ (హెచ్‌సీ 402)ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందించా రు. ఎస్పీ మాట్లాడుతూ ఫాస్ట్ ట్రాక్ కేసు ట్రయల్ సమయంలో సాక్షుల విచారణ, కేసు రికార్డులు, కోర్టు వ్యవహారాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచి కేవలం రెండేళ్ల ఐదు నెలల్లో నిందితులకు శిక్ష పడేలా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

## మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య జయంతి వేడుకలు


బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పసుపులేటి ప్రదీప్‌కుమార్, పసుపులేటి పవన్‌కుమార్, డాక్టర్ చెన్నూరు సుధాకర్, టీడీపీ నేతలు

రాజంపేట, జనవరి13: మాజీ మంత్రి, దివంగత పసుపులేటి బ్రహ్మయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పసుపులేటి ప్రదీప్‌కుమార్, పసుపులేటి పవన్ కుమార్ టీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చెన్నూరు సుధాకర్, రాష్ట్ర బీసీ నేతలు ఇడమడకల కుమార్, మైనార్టీ నేతలు అబూబకర్ బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అభివృద్ధిలో నియోజకవర్గ స్ఫూర్తిప్రదాత అని బ్రహ్మయ్యను కొనియాడారు.


చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నృసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి సహాయ కమిషనర్ జనార్దనరెడ్డికి రూ. 1,00,116 విరాళం అందచేస్తున్న కడప వాసులు ఇడెం హరిబాబు, రాజేశ్వర్లు

# జిల్లాలో 55.99 లక్షల నగదు సీజ్

### ప్రొద్దుటూరులో రూ. 35లక్షలు ● పులివెందులలో రూ.14.99 లక్షలు ● పోరుమామిళ్లలో రూ.6లక్షలు స్వాధీనం

### ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచనతో ఆదాయపన్ను అధికారులకు అప్పగింత



ఆధారాలు లేని నగదుతో ప్రొద్దుటూరు సీఐ శ్రీకాంత్, ఎస్ఐలు - పోలీసు అధికారులు సీజ్ చేసిన రూ.6లక్షలు నగదుతో పోరుమామిళ్ల పోలీసులు

ప్రొద్దుటూరు, జనవరి 13: జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 55లక్షల రూపాయల నగదును పోలీసులు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక అమ్మవారిశాల నాలుగురోడ్ల జంక్షన్‌వద్ద వన్‌టౌన్ ఎస్ఐలు హైమావతి మంజునాథ్ పోలీసు సిబ్బందితో వాహనాల తనిఖీలో రూ.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పులివెందుల మండలం కనంపల్లె చెక్ పోస్టు వద్ద రూ.14.99 లక్షలు, పోరుమామిళ్ల మండలం మల్లకత్తువ చెక్‌పోస్టు వద్ద రూ.ఆరు లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఎలాంటి బిల్లులు లేకుండా బస్సు, కార్లలో తరలిపోతున్న డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకెళితే....

శనివారం సాయంత్రం అమ్మవారిశాల నాలుగు రోడ్ల జంక్షన్‌వద్ద వన్‌టౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఒక వ్యక్తి బ్యాగు పట్టుకుని అనుమానాస్పదంగా వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. అతని బ్యాగులో డబ్బు కట్టలు కనపడ్డాయి. దీంతో అతన్ని పోలీసు స్టేషనుకు తీసుకొచ్చి విచారించి నగదుకు తగిన ఆధారాలు చూపమని కోరగా ఎలాంటి రసీదులు, బిల్లులు చూపని కారణంగా రూ.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీకాంత్ తెలిపారు. ఆ డబ్బు వ్యాపారానికి చెందినదిగా తెలిపినా ఆధారాలు చూపలేకపోయాడన్నారు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా నగదును రెవెన్యూ అధికారులతో పంచినామా చేసి తదుపరి చర్యల నిమిత్తం తిరుపతి ఆదాయపన్ను అధికారులకు అప్పగిస్తామన్నారు. పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకోవడంతో వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐలు హైమావతి, మంజునాథ్ సిబ్బందిని ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్పీ ప్రేర్ణకుమార్ అభినందించారు.

### కనంపల్లె చెక్‌పోస్టు వద్ద....

పులివెందుల టౌన్, జనవరి 13: జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా పులివెందుల మండలం కనంపల్లె చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్నారు. అయితే బెంగళూరు నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న బెంగళూరు వాసి గంజికుంట సుధాకర్ వద్ద రూ. 14.99 లక్షల నగదును పోలీసులు గుర్తించారు. అయితే అతని వద్ద డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు తదుపరి చర్య నిమిత్తం నగదును ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తామని తెలిపారు.

### మల్లకత్తువ చెక్‌పోస్టు వద్ద....

పోరుమామిళ్ల, జనవరి 13: మల్లకతవ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీలో కారులో తరలిపోతున్న రూ.6లక్షలు సీజ్ చేసినట్లు సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మదనపల్లి నుంచి మార్కాపురం వైపు వెళుతున్న ఏపీ 39 జీఎన్ 9966 నెంబరు కారును తనిఖీ చేయగా అందులో మార్కాపురం వాసి చిరంజీవి వద్ద ఎలాంటి బిల్లులు లేకుండా రూ.6లక్షలు ఉండడంతో విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల ప్రకారం ఆ నగదును సీజ్ చేసి ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంటుకు పంపించినట్లు సీఐ తెలిపారు.

# పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

### అలరిస్తున్న గొబ్బెమ్మ పాటలు ● ఆటలాడుతున్న మహిళలు ● ప్రతి వీధిలోనూ పండుగే...



రైల్వేకోడూరు కొత్తబజారు వీధిలో గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు - కోలాటాలు వేస్తున్న మహిళలు

రైల్వేకోడూరు, జనవరి 13: గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రాత్రి వేళ గొబ్బెమ్మ పాటలు అలరిస్తున్నాయి. పండుగ నెల పెట్టిన నాటి నుంచి రైల్వేకోడూరు పట్టణంలో ప్రతి వీధిలోనూ గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి రోజూ రాత్రిళ్లు పాటలు పాడుతూ కోలాటాలు ఆడుతున్నారు. సంక్రాంతి పండుగ కోసం ప్రజలు ఇప్పటికే ఇళ్లకు రంగులు వేసుకున్నారు. కొత్త బట్టలు కొనుగోలు చేస్తున్నారు. రంగు, రంగుల ముగ్గులను మహిళలు ఇంటి ముంగిట వేసుకున్నారు. భోగ భాగ్యాలను ఇచ్చేది భోగి పండుగ, సంక్రాంతి పండుగ రోజున ఇంట్లో చనిపోయిన పెద్దలు వారివారి ఇండ్లకు వస్తారని అందు కోసం వారికి ఇష్టమైన వంటకాలు, పండి వంటలు చేస్తారు. చివరి రోజు అయిన కనుమ పండుగ పశువులను ఊరేగించే పండుగ. పశువులను గ్రామీణ ప్రాంతాల్లో బండ్లకు కట్టుకుని, అలంకరించి తిప్పడం ఆనవాయితీగా ఉంది. ఇదే కాకుండా ఈ మూడు పండుగలు పెద్ద ఖర్చుతో కూడుకున్నది. కొత్తబట్టలు దగ్గర నుంచి ఇళ్లకు పెయింటింగ్స్, ఇంట్లో నిత్యావసర వస్తువులు, మాంసప్రియులు చికెన్, మటన్ వంటలు వండుతుంటారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు భోగి మంటలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కనకాంబరాలు, జాజి, సంపెంగ, చామంతి, చెండుమల్లి, రోజా, కాకడాలు వివిధ రకాల పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ధనుర్మాసం సందర్భంగా ప్రతి ఊరిలోనూ నగర సంకీర్తనలు సాగుతున్నాయి. రంగవల్లులు ఆకట్టుకుంటున్నాయి.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

ఓబులవారిపల్లె, జనవరి 13: కడప-చెన్నై జాతీయ రహదారిపై చిన్నఓరంపాడు వద్ద ఆగివున్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్‌కు వాసి వీరేశ్, వసంత కుటుంబ సభ్యులతో తిరుపతికి వెళుతుండగా ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో ప్రయాణిస్తున్న దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్టు


మట్కా నిర్వాహకులతో సీఐ, ఎస్ఐ

కడప (క్రైం), జనవరి 13: పాత బైపాస్ వద్ద ఇద్దరు మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఎస్ఐ రవికుమార్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. కడప వాసులు పోలియనూరు సందీప్‌కుమార్, ఊటుకూరు సుబ్బరాయుడు మట్కా రాస్తున్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ షరీఫ్ ఆదేశాల మేరకు సిబ్బందితో దాడులు చేసి రూ.60,500 నగదు, చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## చాంపియన్‌షిప్ సాధించిన తూర్పు గోదావరి జిల్లా జట్టు


ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన తూర్పు గోదావరి జట్టుతో పసుపులేటి ప్రదీప్‌కుమార్, పసుపులేటి పవన్‌కుమార్

రాజంపేట, జనవరి13: ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జట్టు నిలిచింది. రాజంపేట శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో మాజీ మంత్రి దివంగత పసుపులేటి బ్రహ్మయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు పసుపులేటి ప్రదీప్ కుమార్, పసుపులేటి పవన్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. 45వ రాష్ట్ర స్థాయి బాలికల అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఇందులో అంతిమ విజయం తూర్పు గోదావరి జట్టు కైవశం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని విజయనగరం జట్టు, మూడో స్థానాన్ని కర్నూలు జట్టు కైవశం చేసుకున్నాయి. వీరికి నిర్వాహకులు కప్పులు, పతకాలను అందజేశారు. ఈ పోటీల్లో 12 జిల్లాల క్రీడాకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వీరికి పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. ఈ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన తూర్పు గోదావరి జట్టు 27వ తేదీన బీహార్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. ఈ పోటీల రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, టెక్నికల్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, సురేష్‌కుమార్, భరత్‌కుమార్, సుధాకర్, రమణ, విజయ నిర్మల, జయరాం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కబడ్డీ ఎంపికలకు అనూహ్యస్పందన


కబడ్డీ ఎంపికల పోటీలో ఆడుతున్న క్రీడాకారిణులు

కడప (స్పోర్ట్స్) జనవరి 13: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన 49వ జిల్లా కబడ్డీ జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. సుమారు 200 మందికి పైగా ఔత్సాహిక కబడ్డీ బాల, బాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. అరుణకుమారి, అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌వీసుబ్బన్న ఎంపికలను చేపట్టారు. ఇందులో ఎంపికైన వారు నంద్యాల పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో 20 నుంచి 23 వరకూ జరగనున్న రాష్ట్ర జూనియర్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సివుంటుందని అసోసియేషన్ కార్యదర్శి వెల్లడించారు.
బాలుర విభాగంలో కేవీసుదర్శన్, ఎ. వేణుసాయి, ఎస్. సురేశ్, ఎన్. జస్వంత్, కె. చంద్రశేఖర్, బి. బ్రహ్మయ్య, డి. వంశీధర్‌రెడ్డి, ఎస్. రుషేంద్రసాయి, కె. విఘ్నేష్, ఎం. రామాంజి, ఎస్. హుస్సేన్, సి. పాల పవన్ ఎంపికవగా బాలికల విభాగంలో ఎం. శిల్ప, ఎన్. నాగజోత్స్న, ఎస్ పూజ, పి. నీలమహేశ్వరి, డి. విష్ణుప్రియ, డి. రేఖ, ఎస్. ఇందు, వై. రజిత, బి. మేరిమంజుల, ఎస్. రషిత, ఎం. ఆస్మ, ఎస్. మస్తానమ్మ, తదితరులున్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కబడ్డీ కోచ్ శ్రీధర్, సీనియర్ క్రీడాకారులు బి. సుహాసిని, లీలావతి, సుమలత, ఆర్ సునీల్, గిరి తదితరులున్నారు.

# ఐటీ ఉద్యోగులంతా ఏకం కావాలి

### రాష్ట్ర భవిష్యత్తు కోసం పిలుపునిచ్చిన రాజంపేట టీడీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, చిత్రంలో సుగవాశి బాలసుబ్రహ్మణ్యం, రమేష్ రెడ్డి

రాయచోటి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడో ఉద్యోగాల్లో ఉంటూ సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు వచ్చిన ఐటీ ఉద్యోగులంతా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఏకం కావాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జరిగిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్ వారి 'మీట్ ది లీడర్' సమావేశానికి హాజరైన ఆయన రాజంపేట పార్లమెంట్ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, రాయచోటి టీడీపీ ఇన్‌చార్జ్ రమేశ్‌రెడ్డితో కలిసి 'పల్లె పిలుస్తోంది రా.. కదలి రా' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో ఉంటూ పండుగకు సొంత గ్రామాలకు వచ్చిన ఐటీ ఉద్యోగులంతా రాష్ట్రం బాగు కోసం ఒక దృఢ సంకల్పం చేయాలని ఐటీ ఉద్యోగులను కోరా రు. గ్రామ సమస్యలు, గ్రామ అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానిస్తూ గ్రామాల్లో ఓటరు జాబితాను సరిచూ సుకోవాలని సూచించారు. పలువురు నేతలు, పెద్ద ఎత్తున ఐటీ ఉద్యోగులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించేంత వరకు పోరాటం ఆగదు

పోరుమామిళ్ల, జనవరి 13 : ఉద్యోగ,ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించేంత వరకు పోరాటం ఆగదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య హెచ్చరించారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును ప్రభుత్వం చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నేతలు ఈశ్వర్‌రావు, చెన్నక్రిష్ణయ్య, విజయరావు, సింహరాయలు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరలను అందుబాటులో ఉంచడమే లక్ష్యం

పోరుమామిళ్ల, జనవరి 13 : ప్రజలకందుబాటు ధరలో నిత్యావసర వస్తువులు అందించడమే లక్ష్యమని కలెక్టరు విజయరామరాజు అన్నారు. శనివారం పోరుమామిళ్లలోని ఇండియన్ పెట్రోలు బంకు ఎదురుగా చేయూత మహిళామార్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసే దిశగా చేయూత మహిళా మార్ట్‌ను పోరుమామిళ్లలో రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఆర్డీవో వెంకటరమణ, పంచాయతీరాజ్‌సలహాదారుడు నాగార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, తహసీల్దారు గంగయ్య, ఏపీయం అశోక్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వెలుగు సీసీలు రహీం, జయచంద్ర పాల్గొన్నారు.

## రుక్మిణి, పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 13 : మనోజీ రావు వీధిలోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున రుక్మిణి పాండురంగస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం భక్తులు సామూహిక విష్ణు సహస్ర పారాయణం చేశారు. మధ్యాహ్నం శ్రవణ నక్షత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. రాత్రి రుక్మిణి పాండురంగ స్వామి ఉత్సవ మూర్తులకు ఊంజల్ సేవ నిర్వహించారు.

## రాజుపాలెం ఎస్‌ఐగా నాగప్రసాద్

రాజుపాలెం, జనవరి 13 : రాజుపాలెం మండలం ఎస్‌ఐగా పి.తులసి నాగ ప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు .ఇక్కడున్న ఎస్‌ఐ రాజగోపాల్ కడప వీఆర్‌కు బదిలీ కావడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో పార్వేట ఉత్సవాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పండుగ జరుపుకోవాలని ఆయన తెలిపారు. మట్కా, జూదం తదితర వాటిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు.

## రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : పుట్టా



పుట్టా ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలు

మైదుకూరు రూరల్, జనవరి 13 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకరయాదవ్ పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం 19వ వార్డు కొత్తపల్లి గ్రామానికి చెందిన గోశెట్టిరవీంద్ర, రఘురామయ్య, బూసోల్ల రామయ్య, రవీంద్ర, శంకరయ్య, దస్తగిరి, పీరుసాబ్ ఆధ్వర్యంలో వారి అనుచర వర్గం సుమారు 20 కుటుంబాలు టీడీపీలో పుట్టా సమక్షంలో టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ అధ్యక్షుడు దాసరి బాబు, జనసేన ఇన్‌ఛార్జ్ పందిటి మల్హోత్రా, ధనపాల జగన్, బీఎస్‌శ్రీనివాసులు, బీపీ సుధా, కటారి క్రిష్ణ, అమీర్‌బాషా తదితర నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



## లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, జనవరి 13 : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పుష్యమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. వేకువజామునే స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



# హామీ ఇచ్చి మోసం చేసిన జగన్

### సాష్టాంగ నమస్కారాలు, పొర్లుదండాలతో అంగన్వాడీ కార్యకర్తల నిరసన



ఎర్రగుంట్లలో సాష్టాంగ నమస్కారం, బద్వేలులో నామాలతో దండాలు పెడుతున్న అంగన్వాడీలు

జమ్మలమడుగు, జనవరి 13: పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత మోసం చేశారని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జమ్మలమడుగు ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తలపై ఎస్మా జీవోకు సంబంధించిన పత్రాలను తలపై పెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల..:** సాష్టాంగ నమస్కారాలతో అంగన్వాడీలు రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన తెలిపారు. 33వ రోజుకు చేరుకున్న అంగన్వాడీల సమ్మెలో భాగంగా శనివారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో వినూత్నంగా తమ నిరసనను తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సాష్టాంగాలతో నిరసన తెలుపుతూ ఈప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలన్నారు.

**కొండాపురం..:** మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు 33వ రోజు శనివారం కొండాపురంలో మంత్రుల ఫొటోలతో నిరసన వ్యక్తం చేశారు.మంత్రులు బొత్స ఉషశ్రీ చరణ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల శుక్రవారం తమ యూనియన్ నేతలతో జరిపిన చర్చలు బూటకమని వారి ఫొటోలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల..:** న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పోరుమామిళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 33వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా అంబేడ్కర్ సర్కిల్ వద్ద సజ్జల, బొత్స, జగన్ మాస్కులుధరించి చర్చలకు పిలిపించి జీతాలు పెంచకుండా వట్టి చేతులతో పంపుతారా అని వేప మండలతో కొడుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**బద్వేలు రూరల్..:** అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి గద్దెనెక్కి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీని సీఎం జగన్ అటకెక్కించారని నమ్మిన వారికి పంగనామాలు పెట్టాడని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఎద్దేవా చేశారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా శనివారం నుదుట నామాలు దిద్దుకుని మమ్మల్ని సీఎం వంచించాడని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లోనాగేంద్రబాబు, చిన్ని, ఖదీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**మైదుకూరు..:** సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందంటూ అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మైదుకూరులో ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీల కార్యకర్తలు పొర్లుడు దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**చాపాడు..:** తహసీల్దారు కార్యాలయం ఎదురుగా శనివారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఎం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించేవరకు ధర్నా కొనసాగిస్తామన్నారు.

## నేటి నుంచి సంక్రాంతి ఉత్సవాలు

చాపాడు, జనవరి 13: మండలంలోని వెదురూరు, రాజుపాళెం, నరహరిపురం గ్రామాల్లో ఈనెల 14న ఆదివారం నుంచి మూడు రోజులపాటు సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వెదురూరు గ్రామంలో సంఘమేశ్వరస్వామి శివపార్వతీదేవిలకు పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేస్తారు. 16న మంగళవారం రాష్ట్రస్థాయి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు మొదటి బహుమతి రూ.1,00,116, రెండో బహుమతి రూ.70,116, మూడో బహుమతి రూ.40,116 ఇస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## దేవాంగ సంఘం ఆధ్వర్యంలో నేడు ముగ్గుల పోటీలు

ప్రొద్దుటూరు , జనవరి 13 : తెలుగు సంస్కృతి సాంప్రదాయ లోగిల్లు రంగవల్లులని దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉట్టినాగశయన పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను పురస్కరిచుకుని ఆదివారం భోగి పండగ సందర్భంగా మధ్యాహ్నం 3నగంటలకు వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణమండపంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రధమ ,ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు.సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## 16 న కె.బొమ్మేపల్లెలో...

కొండాపురం, జనవరి 13 : మండలంలోని కె.బొమ్మేపల్లె ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 16వ తేది శ్రీక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. మొదటి ప్రైజ్ ప్రిజ్ ,రెండు,మూడు ప్రైజ్‌లతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సొలేషన్ బహుమతులను ఇవ్వనున్నట్లు నిర్వహకులు ప్రతాప్‌యాదవ్ తెలిపారు. 8688263011 ఫోన్ నెంబరులో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

# క్షణ..క్షణం.. భయం.. భయం...

● దినదిన గండంలో ప్రయాణికులు ● పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో పైపెచ్చులూడిన శ్లాబు
● నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు ● పట్టించుకోని అధికారులు



పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండు

పోరుమామిళ్ల, జనవరి 13: ప్రయాణికుల కోసం ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండును నిర్మిస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పైపెచ్చులూడి క్షణ క్షణం దినదినగండంగా మారింది. ఏ పెచ్చులు ఏ ప్రయాణికుల మీద ఊడి పడతాయో, ఎవరు గాయాలబారిన పడతారో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన కుర్చీల్లో ప్రశాంతంగా కూర్చోలేక బస్సులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు ప్రయాణికులు. ఏడాదికి పైగా ఆర్టీసీ బస్టాండులో ఉన్న శ్లాబు పైపెచ్చులు ఊడి ఇనుప చువ్వలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు ఉన్నారు పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండుకు నిత్యం, కడప, మైదుకూరు, గిద్దలూరు, సీతారాంపురం, నెల్లూరు, కర్నూలు, విశాఖపట్టణం, బెంగళూరు నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు 40కి పైగా ఉన్నాయి. ముఖ్యంగా కడప నుంచి విజయవాడ, విజయవాడ నుంచి కడప, పులివెందులకు ఈ దారి గుండానే ఎక్కువ వాహనాలు వస్తుంటాయి. అంత ప్రాముఖ్యత కలిగిన ఈ ఆర్టీసీ బస్టాడులో ప్రయాణికుల సౌకర్యం మాత్రం పట్టడం లేదు. నిత్యం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన బి.కోడూరు మండలాల చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థులు పోరుమామిళ్లకు వస్తుంటారు. ఉదయం, సాయంత్రం ఈ ఆర్టీసీ బస్టాండు ఆవరణమంతా విద్యార్థులతో కిక్కిరిసి ఉంటుంది. బస్సులు బస్టాండులో ఆలస్యమైతే నిరీక్షించేవారి పరిస్థితి అగమ్యగోచరం. ఏ శ్లాబు పై పెచ్చు ఎక్కడ ఊడి తలమీద పడుతుందోనంటూ క్షణక్షణం బిక్కుబిక్కుమంటూ నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు ఏడాదికి పైగా పైపెచ్చులు ఊడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నా ఆర్టీసీ అధికారులు శాశ్వత పరిష్కారానికి చొరవ చూపడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలంలో బస్టాండు ఆవరణలోకి వర్షం నీరు రావడంతో ఎక్కువ మంది వర్షంలో తడవకుండా ఈ ఆర్టీసీ బస్టాండు ఆవరణమే ఆసరాగా తీసుకుంటారు. అలాంటి ఈ ఆర్టీసీ బస్టాండులో అరకొర సౌకర్యాలు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. బస్టాండుకు ఫ్లోరింగ్ కూడా చాలా చోట్ల దెబ్బతింది. తిరుణాల సమయాల్లో అదనంగా బస్సులు ఏర్పాటు చేయడం వల్ల బ్రహ్మంగారిమఠం, శైవ క్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులు, భక్తులు అధిక సంఖ్యలో ఈ బస్టాండుకు వచ్చి పోతుంటారు. అలాంటి వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉంది. ఈ విషయమై ఆర్టీసీ డిపో మనేజరు శ్రీనివాసులును వివరణ కోరగా, సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు నిధులు కేటాయిస్తే మరమ్మతులు చేపడతామన్నారు.



పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో ఊడిన పైపెచ్చులు

**నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు..:** దాతలు ఆర్టీసీ బస్టాండుకు మంచినీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ సరిగా లేని కారణంగా ఏడాది నుంచి ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా ఉండిపోయింది. దాదాపు ఐదేళ్ల కిందట ఆర్వోప్లాంటు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లోపం కారణంగా ఏడాది నుంచి ఆర్వోప్లాంటు నిరుపయోగంగా మారాయి. గతంలో ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లగా, కొంత మేరకు మరమ్మత్తులకు నిధులు కేటాయించారు. కానీ అధికారుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఆర్వో ప్లాంటును మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై డిపో మేనేజరు శ్రీనివాసులును వివరణ కోరగా, ఈ విషయాన్ని కూడా అధికారులు దృష్టికి తీసుకెళ్లామని సమాధానం ఇచ్చారు.

## జోరుగా వరినాట్లు

జమ్మలమడుగు, జనవరి 13: జమ్మలమడుగులో రైతులు వరిసాగు జోరుగా చేస్తున్నారు. మండలంలోని ధర్మాపురం, సలివెందుల, దానవులపాడు, పెద్దదండ్లూరు, సిరిగేపల్లె, అంబవరం, గూడెం చెరువు, పి.బొమ్మేపల్లె, తదితర గ్రామాల్లో వరిసాగు అధికంగా సాగు చేస్తారు. అందులో భాగంగా గత వారం రోజుల నుంచి రైతులు వరినాట్లు వేయడం, కొందరు రైతులు పొలాలను దమ్ము చేయడం జరుగుతోంది. ప్రస్తుతం వడ్ల ధరలు పెరిగాయి. జమ్మలమడుగు మండలంలో గత వారం రోజుల నుంచి సుమారు 800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



దానవులపాడులో వరినాట్లు వేస్తున్న కూలీలు

## 30 కుటుంబాలు టీడీపీలో చేరిక



గూడెం చెరువులో భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరినవారు

జమ్మలమడుగు, జనవరి 13: జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి శనివారం సాయంత్రం పర్యటించారు. గ్రామస్థులు పార్టీలో చేరుతామని ఇచ్చిన పిలుపు మేరకు భూపేశ్‌రెడ్డి గూడెం చెరువు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదురుగా పూలదండలు, టపాసులు పేల్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం భూపేశ్‌రెడ్డి 30 కుటుంబాలను టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో టీడీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీలో చేరినవారు వైసీపీ సచివాలయ కన్వీనర్, పదో వార్డు మెంబరు పాతకుంట శివారెడ్డి, మహేశ్వరరెడ్డి, బాలిరెడ్డి, రామచంద్రారెడ్డి, సుబాన్, మురళి, సూరిరాయల్, నాగేంద్ర, మాబాష, సాయి, నరేంద్ర, శివప్రసాద్, వెంకటేష్, వెంపలాకుల బ్రదర్స్, బాలరాజు, నాగరాజు, శంకర్, చెక్కా ప్రసాద్, రాజశేఖర్, పి.యేసన్న, తదితరులు పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండలాధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, రాయల్‌కిరణ్, పొన్నతోట శ్రీను, దేవగుడి యూత్ పుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీపీపీలో స్థానికులకు మొండిచేయి : భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, జనవరి 13: ఆర్టీపీపీని సొంత ఆదాయ వనరులుగా ఉపయోగించుకున్నారే తప్ప ఇక్కడి కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం.జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడూ కృషిచేయలేదని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆర్టీపీపీ కాలనీలో ఆయన బాబు ష్యూరిటీ- భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందు ఇక్కడి టీడీపీ శ్రేణులు బాణాసంచా పేల్చి, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీకి ఓటు వేయాలని భూపేశ్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి దేవగుడి జయరాంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, నాగమణి, యూనియన్‌నాయకులు, టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## సైనికుల్లా పనిచేద్దాం.. విజయం సాధిద్దాం

పెద్దముడియం, జనవరి 13 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా సైనికుల్లా పనిచేసి విజయం సాధిద్దామని టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో అన్నారు. మండల పరిధిలోని జె.కొత్తపల్లె, ఉలవపల్లె గ్రామాలకు చెందిన సుమారు 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీలో చేరిన వారు ముడియం వెంకట సుధాకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, దేవరశెట్టి రాముడు, పాణ్యంలక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, రమణారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై ప్రచారం

పోరుమామిళ్ల, జనవరి 13 : టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు పథకాలను ప్రజలకు వివరిస్తూ టీడీపీ మండల నాయకుడు కొండా రామక్రిష్ణరెడ్డి ప్రచారం చేశారు. శనివారం మండలంలోని క్రిష్ణంపల్లెలో ఆయన టీడీపీ నాయకులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు.

## సార్వత్రిక ఎన్నికలపై సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐలు

జమ్మలమడుగు, జనవరి 13: జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విధులు, సెక్టార్ అధికారులకు పులివెందుల డీఎస్పీ , జమ్మలమడుగు ఇన్‌చార్జి డీఎస్పీ వినోద్‌కుమార్ సూచనలు ఇచ్చారు. పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో పోలీసు అధికారులైన ఎస్‌ఐలు, సీఐలకు, కిందిస్థాయికి సిబ్బందికి విధుల విషయంలో సూచనలు ఇచ్చారు. గత ఎన్నికల్లో ఏఏ ప్రాంతాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, స్థానిక రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రెవెన్యూ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

గోపవరం, జనవరి 13: నెల్లూరు - బద్వేలు ప్రధాన రహదారిలో ఉన్న సెంచురీ పరిశ్రమ పక్కన ఏర్పాటు చేసిన రెవెన్యూ వెల్ఫేర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను కలెక్టర్ విజయరామ రాజు శనివారం ప్రారంభించారు. ఇక్కడ పెట్రోలు బంకు ఏర్పాటు చేయడం వల్ల సమీప గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. హైవేలో అనుకూలమైన ప్రదేశంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేయడం వాహన దారులకు మరింత సౌకర్యం. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు గణేష్, బద్వేలు ఆర్డీవో ఆకుల వెంకటరమణ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఆర్‌ఐ అమర్‌నాథరెడ్డి, సతీష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రూ.కోటీ 50లక్షలతో ఇక్కడ పెట్రోలు బంకు ఏర్పాటు చేశారని సంబంధిత అధికారి ధనుష్ పేర్కొన్నారు.